

# అప్పుడు మానససరోవరానికీ.. ఇప్పుడు వేరే గ్రహానికీ..

చిరంజీవి 'విశ్వంభర' సినిమాపై అంచనాలు మామూలుగా లేవు. మరో 'జగదేకవీరుడు-అతిలోక సుందరి' స్థాయిలో ఊహించేస్తున్నారు అభిమానులు. దర్శకుడు వశిష్ఠ కూడా పాత్రలను ఎంచుకునే విషయంలో పలు జాగ్రత్తలు కూడా తీసుకుంటున్నాడు. రీసెంట్‌గా కథానాయికగా త్రిషను సెలక్ట్ చేయడంతో ఈ సినిమా అంచనాలు మరింత పెరిగాయి. ఫిల్మ్‌వర్గాల సమాచారం ప్రకారం ఈ సినిమాకు చిరంజీవి పారితోషికం డెబ్బైకోట్ల పైమాటేనట. అలాగే త్రిష కూడా పన్నెండుకోట్ల పారితోషికం తీసుకుంటున్నట్టు తెలుస్తున్నది. ఈ సినిమాతో దక్షిణభారతదేశంలోనే అత్యధిక పారితోషికం తీసుకుంటున్న కథానాయికగా త్రిష రికార్డ్ సృష్టించిందని చెప్పుకుంటున్నారు. ఇప్పటివరకూ నయనతారపై ఉన్న రికార్డును త్రిష తిప్పి రాసిందట. ఇదిలావుంటే, 'విశ్వంభర' కథ విషయంలోనూ ఆసక్తికరమైన విషయాలు వెలుగు చూస్తున్నాయి. 'జగదేకవీరుడు-అతిలోకసుందరి'లో హిమాలయాల్లోని మానససరోవరానికి వెళ్లి, అక్కడ్నుంచి మూలికలు తెచ్చి బేబీ షాలినీని కాపాడతాడు చిరంజీవి. అలాగే 'విశ్వంభర'లో దుష్టశక్తులు తన భార్యను వేరే గ్రహానికి తరలించుకుపోతే, ఆ గ్రహానికి వెళ్లి, దుష్టశక్తుల్ని అంతం చేసి తన భార్యను తెచ్చుకుంటాడట చిరంజీవి. 'జగదేకవీరుడు'కి అప్‌డేట్ వెర్షన్‌లా ఈ సినిమా ఉండబోతుందని సమాచారం. యూవీ క్రియేషన్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి ఎం.ఎం.కీరవాణి స్వరాలందిస్తున్న విషయం తెలిసిందే.

# గోల్డ్ స్మగ్లర్‌గా తలైవా?


'జైలర్'గా బాక్సాఫీస్ దుమ్ము దులిపిన రజనీకాంత్ హీరోగా ఓ అడ్వెంచరస్ థ్రిల్లర్ తెరకెక్కనుంది. లోకేశ్ కనకరాజ్ దర్శకుడు. సన్ పిక్చర్స్‌వారు నిర్మాతలు. త్వరలోనే ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ మొదలుకానుంది. ఇది తలైవా 171వ చిత్రం కావడం విశేషం. ఈ సినిమాకు సంబంధించిన ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని ఇటీవలే మేకర్స్ విడుదల చేశారు. లోకేష్ కనకరాజ్ ఈ సినిమా కథ గురించి చెబుతూ.. ఇదొక ప్రయోగాత్మక చిత్రమని, ఇందులో తలైవా పాత్ర మనుపెన్నడూ చూడని విధంగా కాస్త నెగిటీవ్ షేడ్స్‌తో ఉంటుందని, పూర్తిస్థాయి యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కనున్న ఈ చిత్రంలో తన గత చిత్రాల మాదిరిగా మాదకద్రవ్యాల ప్రస్తావన ఉండదని అన్నారు. అయితే.. చెన్నయ్ వర్గాల సమాచారం ప్రకారం ఇందులో రజనీకాంత్ అనేక దేశాలకు బంగారం స్మగ్లింగ్ చేసే డాన్‌గా కనిపిస్తారని తెలుస్తున్నది. బంగారం స్మగ్లింగ్ నేపథ్యంలోనే కథ, కథనాలు నడుస్తాయట. లోకేష్ కనకరాజ్ మార్క్ ఇంట్రస్టింగ్ డీలింగ్స్ ఈ కథలో కనిపిస్తాయని వినికిడి. రీసెంట్‌గా విడుదల చేసిన రజనీ ఫస్ట్‌లుక్ పోస్టర్‌లో కూడా బంగారంతో చేసిన రిస్ట్ వాచ్ కనిపిస్తున్నది. బంగారానికీ, సమయానికీ ఈ కథకూ సంబంధం ఉంటుందని ఆ పోస్టర్ చెప్పకనే చెబుతున్నది. ఇంకా ఈ సినిమాకు చెందిన పూర్తి వివరాలు తెలియాలంటే ఇంకొన్ని రోజులు ఆగాల్సిందే.





# బాబీ డియోల్‌తో ఫైటింగ్

ఓ వైపు పాలిటిక్స్‌లో బిజీగా ఉంటూ మరోవైపు సినిమా షూటింగ్‌లను కూడా చకచకా కానిచ్చేస్తున్నారు నందమూరి బాలకృష్ణ. ప్రస్తుతం ఆయన కేఎస్ రవీంద్ర(బాబీ) దర్శకత్వంలో సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నెల రెండోవారం నుండి ఈ సినిమా షూటింగ్‌లో బాలయ్య జాయిన్ కానున్నారు. బాబీడియోల్, బాలయ్యలపై భారీ యాక్షన్ ఎపిసోడ్‌ని దర్శకుడు బాబీ తెరకెక్కించనున్నారు. ఈ యాక్షన్ సీక్వెన్స్ కోసం భారీ సెట్స్ కూడా నిర్మిస్తున్నారట నిర్మాతలు నాగవంశీ, సాయిసౌజన్య. ఈ సీక్వెన్స్ బాబీడియోల్ పాత్రతోనే మొదలవుతుందట. ఇందులో ఆయన విలన్‌గా నటిస్తున్న విషయం తెలిసిందే. సినిమాకే హైలైట్‌గా ఈ ఎపిసోడ్ ఉండనుందని దర్శకుడు బాబీ చెబుతున్నారు. ముఖ్యంగా బాలయ్య ఆహార్యం, ఆయన యాటిడ్యూడ్ అభిమానులు పండగ చేసుకునేలా ఉంటాయని ఆయన అన్నారు. ఊర్వశీ రౌటేలా, చాందిని చౌదరి ఇందులో కీలక పాత్రలు పోషిస్తున్న విషయం తెలిసిందే. తమన్ ఈ సినిమాకు సంగీత దర్శకుడు.



# ఆ డెడికేషన్‌కి షాక్ అయ్యా..

పుష్ప, యానిమల్ సినిమాలతో నేషనల్ క్రష్‌గా అవతరించింది రష్మిక మందన్నా. ఇప్పటివరకూ హీరో ఓరియెంటెడ్ సినిమాల్లో నటిస్తూ తన నటనతో, అందచందాలతో సినిమాలకే ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన ఈ అందాలభామ.. త్వరలో లేడీ ఓరియెంటెడ్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఆ సినిమా పేరు 'ది గార్ల్ ఫ్రెండ్'. ఇటీవలే షూటింగ్ కూడా మొదలైంది. ఈ షెడ్యూల్ లో పలువురు పాపులర్ యాక్టర్లతోపాటు రష్మిక కూడా జాయిన్ అయ్యింది. ఈ సినిమాకు దర్శకుడు రాహుల్ రవీంద్రన్. రీసెంట్‌గా రాహుల్ అభిమానులతో ఇంటరాక్ట్ అవుతూ 'ది గార్ల్ ఫ్రెండ్' సినిమా గురించి ఆసక్తికరమైన అప్‌డేట్ ఇచ్చారు. 'ఈ సినిమా నా కెరీర్‌కే కాదు. రష్మిక కెరీర్‌కు కూడా ప్రత్యేకం. టీజర్‌ని ఈ నెల 5న రష్మిక పుట్టినరోజు కానుకగా విడుదల చేయనున్నాం. అంతేకాదు, తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమా విడుదల కానుంది. పైగా అన్ని భాషల్లో రష్మిక సొంతంగా డబ్బింగ్ చెబుతున్నది. ఇటీవలే మలయాళంలో టీజర్ కోసం డబ్బింగ్ చెప్పింది. తన డెడికేషన్‌కి షాక్ అయిపోయాను' అంటూ చెప్పుకొచ్చారు. ఇందులో రష్మికకు జోడీగా 'దసరా'ఫేం దీక్షిత్ శెట్టి నటిస్తున్నారు. ఈ సినిమా గురించి రష్మిక మాట్లాడుతూ 'ఇన్నాళ్లూ హీరోలకు జోడీగా నన్ను చూశారు. ఇప్పుడు నేనే హీరో.' అంటూ అందంగా నవ్వేసింది నేషనల్ క్రష్.

# 5 నిమిషాల్లో మరో ప్రపంచంలోకి



'దర్శకుడు కేవీఆర్ మహేంద్రకూ, నాకూ, శివాత్మికకు డెబ్యూ మూవీ 'దొరసాని'. ఆ సినిమా మా ముగ్గురికీ మంచి పేరు తెచ్చింది. మహేంద్ర రెండవ సినిమా అయిన ఈ 'భరతనాట్యం' కూడా నటించిన అందరికీ మంచి పేరు తీసుకురావాలి. నాకిష్టమైన క్రైమ్ కామెడీ జానర్‌లో ఈ సినిమా రూపొందింది. అందుకే సినిమాకోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నా.' అంటూ శుభాకాంక్షలు అందించారు యువహీరో ఆనంద్ దేవరకొండ. ఈ నెల 5న విడుదల కానున్న 'భరతనాట్యం' సినిమా ప్రీరిలీజ్ ఈవెంట్‌కు ఆయన అతిథిగా విచ్చేసి మాట్లాడారు. సూర్యతేజ ఏలే, మీనాక్షి గోస్వామి జంటగా రూపొందిన ఈ చిత్రానికి కేవీఆర్ మహేంద్ర దర్శకుడు. పాయల్ సరాఫ్ నిర్మాత. 'మా నాన్న ధని ఏలే ఈ సినిమాకోసం నాకంటే ఎక్కువ కష్టపడ్డారు. అద్భుతమైన టీమ్ ఈ సినిమాకు పనిచేసింది. మహేంద్ర అద్భుతంగా తీశారు.' అని హీరో సూర్యతేజ ఏలే అన్నారు. 'భరతనాట్యం' అద్భుతమైన ఎంటర్‌టైనర్ అని, ఎక్కడ కూడా కొత్త హీరో సినిమాలా ఉండదని, సినిమా మొదలైన ఐదు నిమిషాల తర్వాత అందరూ మరో ప్రపంచంలోకి వెళ్లిపోతారని, గొప్ప టీమ్ ఈ సినిమాకు పనిచేసిందని దర్శకుడు చెప్పారు. జీవితా రాజశేఖర్, హీరో నవదీప్, శివాత్మికతో పాటు చిత్ర యూనిట్ సభ్యులందరూ మాట్లాడారు.



# వినోదంతో కూడిన ఉత్కంఠ..

మలయాళంలో 200కోట్ల గ్రాస్‌ని రాబట్టి, బ్లాక్‌బాస్టర్‌గా నిలచిన చిత్రం 'మంజుమ్మల్ బాయ్స్'. సౌబిన్ షాహిర్, గణపతి, ఖలీద్ రెహమాన్, శ్రీనాథ్ భాసి ప్రధానపాత్రలు పోషించిన ఈ చిత్రానికి చిదంబరం ఎస్.పొదువల్ దర్శకుడు. పరవ ఫిలింస్ పతాకంపై బాబు షాహిర్, సౌబిన్ షాహిర్, షాన్ ఆంటోని ఈ చిత్రాన్ని నిర్మించారు. రీసెంట్‌గా తమిళంలో కూడా ఈ సినిమా విజయం సాధించింది. ఈ నెల 6న తెలుగు వెర్షన్ విడుదల కానుంది. ప్రతిష్టాత్మక మైత్రీమూవీమేకర్స్‌వారు ఈ చిత్రాన్ని తెలుగులో విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా ఈ సినిమా ట్రైలర్‌ని ఆదివారం విడుదల చేశారు. 'మంజుమ్మల్ బాయ్స్' సినిమా ఎంత ఉత్కంఠకు గురిచేస్తుందో.. ఈ ట్రైలర్ కూడా అంత ఉత్కంఠభరితంగా ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇది నిజమైన కథ ఆధారంగా రూపొందించబడిందని, ఫస్ట్ హాఫ్ మొత్తం వినోదంగా సాగితే, సెకండ్ హాఫ్ మొత్తం భావోద్వేగపూరితంగా, థ్రిల్స్‌తో నిండి ఉంటుందని, దర్శకుడు చిదంబరం అద్భుతమైన సర్వైవల్ థ్రిల్లర్‌గా ఈ సినిమాను మలిచారని నిర్మాతలు చెప్పారు. ఈ చిత్రానికి కెమెరా: షైజు ఖలీద్, సంగీతం: సుశీన్ శ్యామ్, తెలుగు వెర్షన్ నిర్మాతలు: నవీన్ యర్నేని, రవిశంకర్ యలమంచిలి.



# అల్లరి పంతులమ్మ

పూజా హెగ్డే టీచర్ అవతారం ఎత్తింది. వైట్ బోర్డ్‌మీద స్కెచ్‌పెన్‌తో స్టూడెంట్స్‌కి గణితంతోపాటు ఇతర సబ్జెక్టులను కూడా బోధిస్తున్నది. పాపం.. సినిమాలు తగ్గడంతో లెక్చరర్ ఉద్యోగంలోకి దిగిందని అనుకుంటున్నారా!? అసలు సినిమాలు తగ్గిందీ లేదూ.. తను లెక్చరర్ అయ్యిందీ లేదూ. షూటింగ్ విరామంలో ఇలా టీచర్ అవతారం ఎత్తి అక్కడున్న యువతని అలరించింది. ఆ వీడియోను అలాగే ఇన్‌స్టాలో పోస్ట్ చేసి.. ' ఏం చెబుతున్నావ్?.. అని అడక్కండి. ఎందుకంటే అదేమిటో నాకే తెలీదు' అంటూ కామెంట్ పెట్టింది. ప్రస్తుతం ఈ వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. పూజా జోరుకు ఫ్యాన్సందరూ ఫిదా అయిపోతున్నారు. 'అందమైన ఫొటోలతోనే కాకుండా.. అల్లరి వీడియోలతో కూడా మా హృదయాలను దోచేస్తున్నావ్.' అంటూ కామెంట్లు పెట్టేస్తున్నారు ఫ్యాన్స్. ఇంతకీ ఏ సినిమా షూటింగ్ విరామంలో ఈ వీడియో చేసింది? అనేది మాత్రం తెలియాల్సివుంది. ఇదిలావుంటే ప్రస్తుతం పూజా హెగ్డే కెరీర్ మంచి జోష్ మీద ఉంది. బాలీవుడ్‌లో విరివిగా అవకాశాలు అందిపుచ్చుకుంటున్నది ఈ అందాలభామ. ప్రస్తుతం బాలీవుడ్‌లో 'దేవా' అనే సినిమాలో నటిస్తున్న విషయం తెలిసిందే. అలాగే 'హౌస్‌ఫుల్-5', 'షీ వాక్స్' వంటి క్రేజీ ప్రాజెక్ట్‌లకు కూడా సైన్ చేసేసింది పూజా. తెలుగులో కంబ్యాక్ కోసం సీరియస్‌గానే ట్రై చేస్తున్నదని టాక్.

# ఆర్టికల్ 21 ఆధారంగా

సాయికుమార్, పార్వతీశం, ఐశ్వర్య, హారిక ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'మెర్సీ కిల్లింగ్'. సూరపల్లి వెంకటరమణ దర్శకుడు. మాధవి తాలబత్తుల నిర్మాత. శనివారం ప్రీరిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. స్వేచ్ఛ అనే అమ్మాయి చుట్టూ తిరిగే కథాంశమిదని, భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ఆధారంగా చిత్రాన్ని తెరెక్కించామని హీరో సాయికుమార్ తెలిపారు. అనాథ బాలిక తనకు జరిగిన అన్యాయంపై చేసే పోరాటం ప్రతి ఒక్కరిని కదిలిస్తుందని దర్శకుడు అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: అమర్.జి, సంగీతం: ఎం.ఎల్.రాజు, నిర్మాతలు: సిద్ధార్థ్ హరియల, మాధవి తాలబత్తుల, దర్శకత్వం: వెంకటరమణ ఎస్.



# పైలం పిల్లగా.. పైలం..




అంబానీలా వేలకోట్లకు అధిపతి అవ్వాలనేది అతని లక్ష్యం. విలువలేని వ్యవసాయం చేయలేక, వలసపోయి కార్పొరేట్ బానిస కాలేక, ఉన్న ఊళ్లోనే వ్యాపారిగా మారి, పదిమందికి పని కల్పించి తద్వారా కోట్లు సంపాదించాలనే అత్యుత్సాహం ఓ మధ్య తరగతి యువకుడ్ని ఎలాంటి పరిస్థితికి తీసుకెళ్లింది? అతను పడ్డ అవస్థలేంటి? ఈ నేపథ్యంలో సాగే హాస్యభరిత వ్యంగ్యచిత్రం 'పైలం పిలగా!'. సాయితేజ, పావని జంటగా నటించారు. ఆనంద్ గుర్రం దర్శకుడు. రామకృష్ణ బొద్దుల, ఎస్.కె.శ్రీనివాస్ నిర్మాతలు. ఈ చిత్రం ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని విజయవాడ కేఎల్ యూనివర్సిటీలోని విద్యార్థుల చేతులమీదుగా విడుదల చేశారు. యువతరం మెచ్చే చిత్రం ఇదని చిత్రయూనిట్ తెలిపింది. రామ్ మిర్యాల సంగీత కార్యక్రమం ఈ వేడుకలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. డబ్బింగ్ జానకి, చిత్రం శ్రీను, తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: చౌరస్తా యశ్వంత్‌నాగ్, కెమెరా: సందీప్ బద్దుల.



# అలిగి మాట్లాడ్డం మానేశాడు

తన అన్న బోనీ కపూర్ మీద అనీల్‌కపూర్ అలిగాడు. నచ్చజెప్పేందుకు ప్రయత్నించినా తను వినలేదు. మాట్లాడటం మానేశాడు. కారణం ఏంటా? అనుకుంటున్నారా? 2005లో సల్మాన్ ఖాన్, అనిల్‌కపూర్ ఫర్దీన్‌ఖాన్ ప్రధానపాత్రల్లో అనీస్ బాజ్మీ దర్శకత్వంలో బోనీకపూర్ 'నో ఎంట్రీ' చిత్రాన్ని నిర్మించిన విషయం తెలిసిందే. ఈ సూపర్‌హిట్ చిత్రానికి సీక్వెల్ నిర్మించే పనిలో ఉన్నారు నిర్మాత బోనీకపూర్. ఈ అన్నదమ్ముల మధ్య గ్యాప్ రావడానికి కారణం ఇదేనట. ఈ విషయం బోనీ కపూర్ చెబుతూ ' 'నో ఎంట్రీ' సీక్వెల్ గురించి తెలిసి అనిల్ నన్ను సంప్రదించాడు. అయితే, ఇందులో ఖాళీ లేదని చెప్పాను. తనకు కోపం వచ్చింది. మాట్లాడ్డం మానేశాడు. ఈ కథలో తనకు స్థానం లేదు. అర్థం చేసుకోకపోతే ఎలా? ఈ సినిమా కథ గురించి నేను ప్రస్తావించదలచుకోలేదు. ఎందుకంటే గతంలో ఇలాగే స్టోరీ గురించి డిస్కస్ చేస్తే కొందరు కాపీ కొట్టేశారు. అందుకే చెప్పను. ఈ సీక్వెల్‌లో అర్జున్‌కపూర్, దిల్జిత్, వరుణ్ ధావన్ నటిస్తారు. అలాగే ఇందులో పదిమంది హీరోయిన్లుంటారు. వాళ్ల ఎంపిక జరగలేదు. ప్రస్తుతానికి ఇంతకంటే చెప్పను. అనిల్ నాతో మాట్లాడకపోతే, నేను అతనితో మాట్లాడతా.' అంటూ నవ్వుతూ చెప్పుకొచ్చారు బోనీకపూర్.

# 1980లో జరిగిన యథార్థగాథ



రాకేష్ వర్రే కథానాయకుడిగా రూపొందుతోన్న పొలిటికల్ డ్రామా 'జితేందర్‌రెడ్డి'. రియా సుమన్ కథానాయిక. విరించి వర్మ దర్శకుడు. ముదుగంటి రవీందర్‌రెడ్డి నిర్మాత. ఈ చిత్రం మే 3న విడుదల కానుంది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ ' 1980లో జగిత్యాలలో జరిగిన యథార్థ గాథ ఇది. ఎంతో రీసెర్చ్ చేసి ఈ సినిమా చేశాం. నిజాయితీగా తీసిన సినిమా ఇది. విలువలతో కూడిన పాత్రలు ఇందులో కనిపిస్తాయి' అని చెప్పారు. 1980నాటి లొకేషన్స్‌తోపాటు అప్పటి వాతావరణాన్ని చక్కగా తెరకెక్కించామని, రాకేష్ వర్రేకు హీరోగా మంచి భవిష్యత్తు ఉందని, ఎవరినీ కించిపరిచేలా ఈ సినిమా ఉండదని నిర్మాత తెలిపారు. ఛత్రపతి శేఖర్, సుబ్బరాజు, రవిప్రకాశ్, తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: జ్ఞానశేఖర్, సంగీతం: గోపీసుందర్.